

ప్రొడక్షన్

"ఏవండోయ్! వరహాలరాజుగారూ?"

"ఎవరదీ! ఇలా కొంచెం దగ్గిర్గా క్లోజప్పులోకి రండి."

"నమస్కారమండి. నేను....గుర్తులేనూ? రాయుణ్ణి భవదీయుణ్ణి."

"గ్నాపకం రాలేదు. కొంచెం ఫ్లాషుబాకులో మాట్లాడి మీ వెనుకటి కథ చెప్పండి" అన్నాడు రాజు నల్లకళ్ళజోడు లోంచి గంభీరంగా చూస్తూ.

రాయుడు వినయంగా నవ్వాడు. 'చెప్పడానికి నేను రెడీయేకానండి, వెనకటి కథంతా చెప్తే ఇప్పుడు కథకి చోటు చాలదని భయం. పాసార్థి గారు ఊరుకోరు'

"వారుట్టి దగాకోరులా ఉన్నారే. ఎక్కడా దొరకడు. బాక్సాఫీసు ఫిలింరైటర్లకన్న అన్యాయం. నేను డబ్బులేక లాట్రీ కొడ్తుంటే అప్పు డంతా రాసి, తీరాప్రొడ్యూసర్నయ్యే సరికి పబ్లిసిటీ ఇవ్వాలని పరారీ అయిపోయాడు .... డోంట్ కేర్. నీకథ చెప్పు. నువ్వెవరు?"

"నేను రాయుణ్ణి గదండీ. మీరూనేనూ నాలుగైదు కథలనుంచి కలిసి తిరుగుతున్నాం. ఒక్క టీ తాగి, ఒక్క సిగరెట్టు కాల్చుకున్న వాళ్ళం .... "

"హోహో తెలిసింది. నువ్వ రాయుడివన్నమాట — ఆ సంగతి చెప్పవేం."

"చెప్పానండి"

"చెబితే చెప్పావుగాని ఇప్పుడేం చెయ్యడం వాటీజ్ మై నెక్ట్స్టెప్."

'ముళ్ళపూడిగార్ని కనుక్కు రానాండి?'

"య్యస్....కాదు కాదు చఫ్! వాడెవడు మధ్య నేనేం చెయ్యాలో చెప్పేందుకు. నాయిష్టం వచ్చినట్లు చేస్తాను. వెంటనే పిచ్చరు తీస్తాను. స్టుడియోకి నడు" అన్నాడు రాజు పాసార్థిమీద కోపంకొద్దీ.

రాయుడు మటుకు సై అనలేదు. కొంచెం గౌరవంగా, కాస్త జాలిగా నవ్వాడు "సార్! పాసార్థి వద్దన్నాసరే, సరేనన్నా సరే; మీరు మాత్రం యిప్పుడు పిచ్చరు తీయలేరు."

"షటప్. అయామే లాక్ రుపీస్. ఎందుకు తియ్యలేను."

"బట్ యువార్ నాటే రాఫిలిం కోటా .... మీ దగ్గర లక్షల లక్షల డబ్బైభవేల రూపాయలున్నా ఫిలిం తియ్యలేరు. ఇప్పుడు రాఫిలిం దొరకటం లేదు. అందికనేకదా కిందటిసారి నాల్నెల్ల ముందర మీరు సుడియో షూటింగు కెళ్ళి గల్లంతయి పోయారు. ఆవాళ ఫిలిం లేక కాల్షీటు కాన్సిలైంది. అప్పణ్ణించి ఇంకా ఫిలిం తియ్యలేదేం మరి .... మీరే ఆలోచించండి."

రాజు ఆశ్చర్యపడి లేచాక, నిజమేనా అన్నాడు. రాయుడి జవాబు వినకుండానే, అంచేతేనన్నమాట నేను కనబట్టం లేదు అన్నాడు. మరిప్పుడెలా అన్నాడు.

రాయుడు ఎలా అని ప్రతిధ్వనించాడు.

"పోనీ పాసార్థి నడిగితే, రాఫిలిం కోటా యిప్పించమని?"

"ఆయన బొంద. ఆయనేం యిప్పిస్తాడు."

రాజు ఆలోచనలో మునిగిపోయి తేలాడు.

"వాడి సొమ్మేం పోయింది? కథలో ఉత్తుత్తి సినిమా కోసమే కదా ఈ కోటా" అన్నాడు తెలివిగా.

"ఉత్తుత్తి సినిమాలకోసం కోటాలా, గిరాకీ కూడా చాలా ఎక్కువలా ఉందండి. కొందరు నిజం సినిమాలు తియ్యడానికి ఉత్తుత్తి కోటాలు దొరుకుతున్నాయి, మనలా ఉత్తుత్తి సినిమాలు తీసేవాళ్ళకేమో."

"షటప్ .... నే నెవరనుకున్నావు. అయామే లాక్ రూపీస్ బిగ్ ప్రొడ్యూసర్ డైరెక్టర్ యాక్టర్. నాకు బోల్డు గ్లామరుంది!"

'మరేండి. మీకు సినిమామీద చాలా గ్లామరుంది.'

* * * *

''ఉత్తి కాకి గోల''

* * * *

'ఎవరది!' అన్నారు రాజూ రాయుడూ జాయింటుగా తుళ్ళిపడి. ఒకళ్ళ నొకళ్ళు చూసుకోడం అయ్యాక చుట్టూరా చూశారు. ఎవరూ కనబళ్ళేదు. "ఎవరది మన్ని కాకిగోల అంటా. నువ్వా?" అన్నాడు రాజు మెల్లిగా.

"కాదు మీరా?"

"కాదు ఎవరో—''

"ఎవరూ కనబట్టం లేదండీ....కానీ"

"పాసార్ధిగాడు కాదుగదా?"

"కాడు వాడలా అనడు లెండి. కాని—ఎవరో చెప్పనా? ఈ కథ చదువుతున్న వారనుకుంటా"

"నిజమే?"

"ఒట్టు"

* * * *

రాజు హఠాత్తుగా గాంభీర్యం పులుముకున్నాడు. కాలరు సర్దుకున్నాడు. కళ్ళజోడు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకున్నాడు. షోగ్గా పొడిదగ్గు దగ్గాడు. ఠీవి నటించాడు. ఆ దారే వస్తున్న అద్దెకారు నాపాడు. మాట్లాడకుండా ఎక్కి పోయాడు. "స్టార్ట్" అన్నాడు ముక్తసరిగా.

"ఎంగె" అన్నాడు టాక్సీవాడు.

'ఇమ్మీడియట్లీ' అన్నాడు రాజు ధాటీగా.

'అది సర్దా(బా....య్యోంగే అని కెట్టా, అది చొల్ల మాటేంగర్ఁయే.'

'స్టుడియో' అన్నాడు రాజు టూకీగా కోపంగా.

'ఇద్దొ పరక్కరేం.'

రాజు స్టుడియో హాలులో కూర్చున్నాడు.

"నెంబరు టూ ఫ్లోరు, కుడివాటాలోట మనషూటింగు పదండి" అన్నాడు రాయుడు పైనం కనుక్కొచ్చి.

వరహాలరాజు ఎంతో సంతోషంతో పొంగిపోతున్నాడు.

"చూడగా చూడగా నేను సినిమా వాళ్ళలో కలిసి పోయినట్టే ఉందే" అన్నాడు.

"కాక మరేమిటండీ ఫిలింప్రొడ్యూసరు అయి ఉండి కూడా ఆశ్చర్యం ఏమిటండీ మరీ బడాయి. ఏదో మతక సామెతపతుగా ఉంది మీరన్నది."

*   *   *   *

సెట్‌మీద చీకటి నిశ్శబ్దంగా ఉంది. ఒకరిద్దరు కునికిపాట్లు పడుతున్నారు. ఒక స్థూలబాల, మేకప్‌మన్ కొసరికొసరి వేసిన పిసరంత రంగును జాకెట్ మిరర్‌లో సరిచూసి దిద్దుకుంటోంది. 'మాతాత చచ్చిపోయి నాకు డబ్బురాగానే' తీసే నెక్స్ట పిక్చరులో తను ఆమెను ఎంత పైకి తీసుకురాబోతున్నాడో, మెల్లిగా చెబుతున్నాడు ఒక ప్రొడక్షన్ అసిస్టెంట్. ఏడిశావుపోదూ అంటోంది ఆమె హాఁనగా. 'కొయ్ నారంగా' అని ఆ గిరీశాన్ని వెక్కిరిస్తున్నాడు ఒక అసిస్టెంట్ డైరెక్టరు. ఓ మూలనున్న ఈ ముగ్గురూ మినహా మిగతా వాళ్ళంతా దిగులుగా చూస్తున్నారు దశదిశలా.

సెట్ మధ్యన, కామెరానీడన, ఓ కుర్చీలో ఒక గేరాజుత్తు పెద్ద మనిషి సన్నగా, నల్లగా, దిగులుగా కూర్చున్నాడు. ఏపుగా పండిన జొన్నచేలో, కంకుల బరువుకి తల వాల్చిన మొక్కలా, అయిడియాల భారంతో దాదాపు నడ్డి వరకూ ఆయన వంగిపోయాడు. మోకాళ్ళమీద మోచేతులాన్చి ఎడమ అరచేతిలో మొహం దాచేసుకుని, కుడిచేతి వేళ్ళతో ఒత్తు జుత్తును లాలిస్తున్నాడు.

రాజూ రాయుడూ సభామందిర మధ్యానికి వచ్చారు జోళ్ల చప్పుడు చేసుకుంటూ. సభలో ఉన్నవారంతా హడలిపోయి వింతగా చూశారు వారివంక. హాలాహలం మింగబోతున్న శివుడిని దేవతలు అలా చూసి ఉండరు. శిబిచక్రవర్తి పావురంకోసం అని తక్కెడలో ఎక్కుతున్నపుడు ఆయన ఫాన్‌లు అలా చూసిఉండరు. సిడ్నీకార్టన్ తన ప్రియురాలి సౌఖ్యం కోసం గిలటిన్‌లో తలపెట్ట తలపడినపుడు ప్రేక్షకులు అలా చూసి ఉండరు. అయితే పైవాళ్ళు ఓ గొప్పకార్యం కోసం ఇంత త్యాగం చేశారు. మరి వీళ్ళు? వీళ్ళు దేనికోసం ఇంత త్యాగం చేస్తున్నారు? ఇంతటి సాహసం ఏల? అని పరి పరి విధాల తర్కించుకున్నారు. డైరెక్టరుగారికి కోపం వస్తే వాళ్ళకి పుట్టగతులుండవే అని పరితపించారు. ఇలాఉండగా, దీనికి తోడుగా రాజు పేట్రేగిపోయి, కాళిదాసు తాలూకు 'రాభణాసురుడు' డైలాగు లాటిది ఒకటి అనేశాడు.

మొదట అతనూ ఓర్పు చూపాడు. కుర్చీలో ఆయన తనకి మర్యాద చేస్తాడేమోనని. ఆయన ఎంతకీ కదలకపోయే సరికి శ్రద్ధగా చూశాడు. తెలివైనవాడు కాబట్టి ఓహో అనుకున్నాడు కారణం ఊహించేసి.

"ఎవరు పోయారూ?" అన్నాడు గట్టిగా.

రాయుడికి పైప్రాణాలు పైకి పోయాయి. లోపలివి అరికాళ్ళదాకా దిగిపోయాయి.

"ష్. ఎంతమాట అనేశారు. ఆయనే డైరెక్టరుగారు. మూడ్‌లో ఉన్నారు. ఇప్పుడే ఆయనకి అయిడియాలు అవుతున్నాయి." అన్నాడు రాయుడు భయభక్తులతో.

అంతలోకి డైరెక్టరే తలెత్తారు. 'ఎవడ్రా నువ్వు' అంది ఆయన మంద్ర గ్రీవం.

"నేనండి. ప్రొడ్యూసర్నండి. తమరి యజమానిని" అన్నాడు రాజు వినయంగా.

"ఓ. కూర్చో. మాటాడకు" అన్నాడు డైరెక్టరుగారు.

రాజు కూర్చున్నాడు. 'యాక్టర్లు ఎవరెవరండీ .... మూజిక్కు ఎవరండీ. శాంగ్సులు ఎవరండి' అన్నాడు ఉత్సాహంగా.

'సైలెన్స్' అని గావుకేక పెట్టాడు డైరెక్టరుగారు. సైలెన్స్ చక్కావచ్చి చేతులు కట్టుకు నిల్చుంది.

డైరెక్టరుగారు రాజు మీదికి అభిమానం రంగేసిన నవ్వు విసిరారు. రాజు దానికి కృతజ్ఞత పులిమి ఆయనకి మళ్ళీ యిచ్చేశాడు.

'యాక్టర్లు ఇపుడపుడే రారు. రాత్రి ఏడింటికి వస్తారు. మ్యూజిక్ రెడీ అయినట్టె .... ఎవడ్రా అక్కడ మ్యూజిక్కు ఇలాతెండి.' అన్నాడు డైరెక్టరు.

సన్నటి నల్లటి కుర్రాడొకడు ఓ అట్టపెట్టి తెచ్చి అందిచ్చి నిల్చున్నాడు.

"ఇతనేనా మూజిక్ డైరెక్టరు?" అన్నాడు రాజు.

"అబ్బే నేను కాదండి. నాకేం తెలీదు." అన్నాడు కుర్రాడు తుళ్ళిపడి.

డైరెక్టరు నవ్వాడు. 'మ్మనం' అన్నాడు సగర్వంగా.

'మీకు మ్యూజిక్కు డైరెక్షనింగుకూడా వచ్చా?'

'మీకురాదా?' అని ఉరిమాడు డైరెక్టరు.

"వచ్చుననుకోండి.....!" అన్నాడు రాజు గుటకమింగి.

"మరింకే అలాడుగుతారు. ఇదిగో ఇందులో పన్నెండు పాట లున్నాయి. పదకొండే అనుకోండి. పదకొండోదేమో, పిక్చర్లో నాలుగోది అన్నమాట. అది సిక్స్‌మినిట్ సాంగులెండి."

రాజు ఆశ్చర్యపోయాడు. "ఎంత ఆశ్చర్యం! నేను నిన్న ప్రొడ్యూసరు అయ్యాను. యివాల్టికే మ్యూజికల్ రికార్డింగు ఫినిషింగయి పోయిందంటే—భలేగా వుందికదూ."

"కాదు మరీ — రికార్డింగేమిటి. ఈ సాంగ్సన్నీ హిట్ అయిన సాంగ్సే, అందుకే అందరు ప్రొడ్యూసర్లూ, నా సెలక్షనంటే, పడి ఛస్తారు."

"ఏదీ చూడనివ్వండి" అన్నాడు రాజు అట్టపెట్టె అందుకుంటూ.

'వన్ మినిట్' అన్నాడు డైరెక్టరు ఆ పెట్టెమూత అదిమిపట్టి: 'ఇందులో ఎవరెవరుంటారు గెస్ చెయ్యండి' అన్నాడు.

రాజుకి అర్థం కాలేదు. 'ఎవరంటాడేమిటి. ఇందులో మనుషులుంటారా?' అన్నాడు రాయుడితో మెల్లిగా.

'ఆయన్నే చెప్పమను' అన్నాడు రాయుడు నవ్వి.

డైరెక్టరు అట్టహాసం చేశాడు "హోఫీన్నయ్యార్; నౌషాద్, రామచంద్ర,—ఆఫ్‌కోర్సు శంకరెండ్ జైకిషనూ, బర్మన్, బిశ్వాస్, సరే అందులో సాంగుకోసం త్రిపాఠీ, అక్కడికేమయింది ఇండియాన్

బాక్సాఫీసు మ్యూజిక్ డైరెక్టర్స్ ఏడుగుర్ని మన పిక్చరుకి బుక్ చేశాం అన్నమాట చూసోక్కమరి తడాఖా."

"ఓరి నాయనో! వాళ్ళలో ఒకొక్కడినే మనం భరించలేమని పేపర్లో రాశారే! ఏడుగుర్నే. ఇంకేమన్నా ఉందా. మనం పిక్చరు తీస్తున్నామా? దివాళా ఎత్తుతున్నామా? వాళ్ళ సోడాలికే రోజు ఇరవై రూపాయి లవుతాయట. — సోడాలతో నీళ్లోసుకుంటార్ట. — మంచినీళ్ళు అలవాటులేక బాదంకీరూ గట్రా తాగుతారట. ఏర్కండిషన్ లేకపోతే గదంతా అయిస్క్రీం పోయిస్తారట"

"మరేం ఫరవాలేదు అధైర్యపడకుడు. నేను రోజుకి పది రూపాయలు దాటకుండా చూస్తాను." అన్నాడు హఠాత్తుగా వచ్చిన ఒక నడికారు మీసాలాయన చాలా ఉత్సాహంగా.

"వీరెవరు?"

(వాడిపేరు 'సశేష' గిరి. ఉద్యోగం ప్రొడక్షన్ మేనేజరు గిరీ. ఎలాటి ఖర్చులోనైనా డబ్బు కాస్తో, కూస్తో 'శేషం' వేస్తాడని వినికిడి.)

'వీరెవరు?'

'వీరిపేరు శేషగిరి. ప్రొడక్షను మేనేజరు' అన్నాడు డైరెక్టరు.

అని, డబ్బు పొదుపుచెయ్యాలని ఊహూ ఉత్సాహ పడిపోతున్న సశేషగిరివంక చూసి, 'గిరిగారూ! మీరేమీ పొదుపు చెయ్యక్కర్లే. అదేదో నేచూస్తా....రాజుగారూ! మీరెవర్నీ నమ్మకండి. ప్రొడక్షన్ మానేజర్లని పెట్టుకోడం దురుసునోటి అప్పులాళ్ళ తిట్లు భోంచెయ్యడానికేనని గుర్తుంచు కోండి" అని ధైర్యం చెప్పాడు డైరెక్టరుగారు..

"సరే యిప్పుడు ఏంచేద్దాం. మూజిక్కు సంగతి చెప్పండి" అన్నాడు రాజు విసుగెత్తి.

డైరెక్టరుగారు గ్రామఫోను తెప్పించారు. అట్ట పెట్టి విప్పి, ఒక్కొక్క ప్లేటే పెట్టించారు.

గ్రామఫోను పెడుతున్నాయన, ఒక్కొక్క పాటకీముందు దానిపేరు, మ్యూజిక్ డైరెక్టరు పేరూ చెప్పి, పెడుతున్నాడు. ఇది శాడ్ సాంగ్, ఇది గ్లాడ్ సాంగ్, ఇది మాష్ సాంగ్, మూడ్ సాంగ్, అని తీర్పు చెబుతున్నారు డైరెక్టరుగారు.

అయితే ఇపుడు మనం హిందీ పిక్చరు తీస్తున్నామన్న మాట. హారినీ! అన్నాడు రాజు తెలివితేటలన్నీ వాడేసి.

"నోనో తెలుగే. ఇది హిట్టయితే ఏకంగా టమిల్, హిందీలలో తీసి పారేద్దాం....ఇపుడు మీరు వింటున్నవి అన్నీ హిందీ హిట్ సాంగ్స్, వీటిని అన్నిటినీ మనం ఎడిట్‌చేసి తెలుగు చేస్తూన్నాం ఇగో ఈయనే ఇవి ఎడిట్ చేసే ఆయన" అన్నాడు డైరెక్టరుగారు.

గ్రామఫోను పెడుతున్న పెద్దమనిషి గంభీరంగా రాజుకి దండం పెట్టాడు.

'మ్యూజిక్ డైరెక్టరో మరి?' అన్నాడు రాజు.

"మ్యూజిక్ డైరెక్టరు అంటూ వేరేలేరు. వాళ్ళు చాలా అడుగుతారు. చెప్పినట్టు అందరూ వినరు. మనకు మూజికు ఎడిటరే ఉంటాడు. డైరెక్షను మనదే" అన్నారు డైరెక్టరుగారు. దగ్గరే ఉన్న కుర్రాడు ఆయన గుండెమీద తీవిగా కొట్టాడు.

రాజు బుర్రలో ఓ ఆలోచన మెరిసింది. ఏదో అనబోయి తగ్గాడు ....తటపటాయించాడు. తెగించి లేచి, "డైరెక్టరుగారూ ఓ చిన్నమాట. అసింటారండి" అన్నాడు.

డైరెక్టరు కదల్లేదు. చుట్టూచూసి, హూంకరించాడు. అంతా దూరంగా వెళ్ళారు. 'చెప్పండి' అన్నాడాయన.

ఈ అయిడియా చూసిన రాజు ఆశ్చర్యానికి అంతులేదు. ఆనందానికి హద్దులేదు. 'ఎలాగేనా డైరెక్టరంటే డైరెక్టరే' అన్నాడు.

"కాపోతే డైరెక్టరంటే ప్రొడ్యూసరెలా అవుతుంది."

"అదికాదుసార్. మీకెంత బ్రహ్మాండ అయిడియా వచ్చింది! మ్మనం అసింటా వెళ్దాం అంటే, మిగతా వాళ్ళని దూరంగా పంపేసి, మనం కదలకుండానే అసింటా వెళ్ళినట్టు చేశారు. అయిడియా కాదూ ఇది మరీ!"

'అదా అన్నాడు' డైరెక్టరుగారు ఇలాంటివి చాలా సహజమన్నట్టు.

రాజు, ఆయన దగ్గరగా జరిగాడు.

"చూడు గురూ! ఈ పిక్చరులో సాంగ్స్ తెలుగులోనే ఉంటాయి గదా! అవి మన్ని రాయినిస్తారూ? అయామే గుడ్‌సాంగ్‌రైటర్" అన్నాడు రాజు మెల్లిగా.

డైరెక్టరుగారు ఫెళఫెళ నవ్వేశారు. కొంచెం అసింటా ఉన్న స్టుడియో కొండగుహ 'ఎళఎళ' అని ప్రతిధ్వనించింది.

'భలే వాడివయ్యా! ఈ పిక్చరునీది. నువ్వే ప్రొడ్యూసరువి. పాటలు రాయాలనుకుంటే, నిన్ను అడ్డేవాడెవడు. దర్జాగా రాసెయ్ కాని ఒకటే చిక్కు నువ్వు పెద్దరైటరని నాకు తెలీదే. పసిగట్టలేకపోయా. అందుకని ఏంచేశానంటే బావమరిది లేడూ'—

'మీకు బామ్మర్ది ఉన్నాడా?

'ఉన్నాడులే. వెధవ ఫోర్తుఫారం తప్పి అడ్డగాడిదలా తిరుగుతూంటే—తప్పితేనేం గాని, వాడికి యమ పేస్తుందిలే — సరే ఈ లైనులో పెడదామని ఓడజను పాటల ప్రస్తారాలు వాడి ముందర పడేసి పాటలు రాయి వెధవాయా అన్నాను. తీరాచూస్తే వాడన్నీ హిట్‌సాంగ్స్ రాసే

కాడు! దారుణంకదూ? అన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయి. ముందరేమో, పాటకి వంద ఇప్పిద్దామనుకున్న వాణ్ణల్లా సంతోషం కొద్దీ పాటకి నాలుగొందలు యిప్పిస్తానన్నాను. వాడిబిల్లు చూస్తారు గదూ అన్నట్టు....ఇదో రాజుగారూ....ఒకటిచెబుతా. మనం కవులనెపుడూ బాధపెట్టకూడదు. అది చాలా మహాపాపం. కాని సినిమావాళ్ళంతా అంతే. అన్నిటికీ తగలేస్తారు గాని కవిదగ్గర కొచ్చేసరికి బేరం ఆడతారు పొదుపు చేస్తారు. వందిచ్చి పదొందలికి బిల్లు రాయించుకుని, స్టార్లకిచ్చిన బ్లాకు డబ్బుని సర్దుకుంటారు. దానికికూడా తిప్పితిప్పి ఏడిపిస్తారు. ఇది నాకిష్టం లేదు. అంచేత మీరు ముందర కవిగాడికి ఇవ్వండి. పాటలన్నీ భేషైనవి."

రాజు ఈ గంభీరోపన్యాసానికి ఉబ్బొంగిపోయాడు. అతనికి చాలా గర్వం కలిగింది. మందే ఆదర్శకంపెనీ అన్నాడు. తప్పకుండా కవికి ఇచ్చేదామన్నాడు.

"కాని ఇంకొక్క రిక్వెస్టు సార్, నేను శాంగ్సు రాయకపోతే పాయెగాని, రాసిన వాటిలో ఎక్కడేనా 'ఆర్నవము' అనే మాట పెట్టించండి. అది భలే వరుడులెండి. నాకు చాల యిష్టం. ఎప్పణ్ణించో అదిపెట్టి పాటరాయాలని, అదిపెట్టి పిక్చరు తియ్యాలనీ కలలు గాంచుతున్నాను" అని ప్రాధేయ పడ్డాడు.

ప్రొడ్యూసరు ముచ్చట చెల్లించాలని డైరెక్టరుకూడా ముచ్చట పడ్డాడు. అసలు అలాటి పెద్దమాటలు ఓడజనేనా ఉండాలన్నాడు. ఉంటే డిస్ట్రిబ్యూటర్సుకూడా తొరగా డబ్బివ్వచ్చును అన్నాడు. వెంటనే ఫ్లోరు అవతల గాలి పీలుస్తున్న తన బావమరిదిని పిలిపించాడు.

'ఈనే కవిగారు!' అని పరిచయం చేశాడు. 'ఏరా అబ్బీ!' 'ఆర్నవం'ట అదెక్కడేనా పెట్టావా పాటల్లో' అన్నాడు.

'లేదు బావా ఏమిటది?'

"నీ బొంద ఎందుకు పెట్టలే? బుద్ధిలేదు? ఆర్ణవం అన్నమాట లేకుండా పాటలు రాసినవాడివి నువ్వెందుకు పనికొస్తావు? అసలు అది లేకుండా ఎవడన్నా పాటలు రాస్తాడా అని. వెంటనే పెట్టు" అని గర్జించాడు.

"పెడతాను బావా కాని అలాటి మాటలేదు. ఉన్నా ఇందులో పనికిరాదు" అన్నాడు బావమరిది ధైర్యంగా, ఓపక్క తలత్ మహమద్ కంఠంలా గజగజ వణికిపోతూ.

"ఛప్! ప్రొడ్యూసరుగారి కన్నా తెలుసా నీకు?"

జేబులోంచి కాయితాలు తీసి గబగబ చూసి, 'అయినా ఎక్కడా పట్టదు బావా. అన్నీ టైటుగా ఉన్నాయి. చోటూ లేదు. సందర్భం కుదరదు' అన్నాడు బావమరిది జంకుతూనే.

'పెట్టమంటే నీగ్గాదూ....సూపరింపోజు చెయ్యి చోటు లేపోతే .... మీ కవిగాళ్ళతో ఇదేచిక్కు. చెబితే వినరు. తిడితే కనరు. స్వతంత్రం మింగేస్తున్నారు ప్రొడ్యూసర్లని గోల' అని మండి పడ్డారు డైరెక్టరు గారు.

బావమరిది ముందు బిక్కమొహంపెట్టి ఆనక దుఃఖ సముద్రంలో మునిగి పోయాడు.

ఇదంతా చూసి, రాజుకి ఏడుపొచ్చేసింది. భయం వేసింది.

'ఛీ! నామూలాన కదా కుటుంబకలహం వచ్చింది. ఆర్ణవం కోసం కుటుంబంచ్ఛిద్రం అయిపోతే నాహృదయ భాండం భరించలేదు. సార్! ఆర్ణవం మానెయ్యండి' అన్నాడు భోరునఏడుస్తూ, స్టుడియో ఆకాశంలోకి చూస్తూ.

డైరెక్టరు గారికీ ఈసీను చూసేసరికి గుండె దుఃఖం పొంగి పొరలి పోయింది.

అప్పుడు ముగ్గురూ ఏడిచేశారు. డైరెక్టరుగారూ, ప్రొడ్యూసరూ, కవీను.

కాసేపు ఏడిచాక, 'అర్నవం ఎలాగో అలా పెట్టేయ్' అన్నారు డైరెక్టరు కళ్ళు తుడుచుకుంటూ.

'పెట్టేస్తాను బావా.' అన్నాడు బావమరిది ఎక్కిళ్ళు ఆపుకుంటూ.

'ఒద్దు' అన్నాడు రాజు ముక్కు చీదుకుంటూ.

పెడతాం అన్నారు వాళ్ళు; వద్దంటాడు రాజు.

రాజు ఎంత వద్దన్నా, అని ఏడిచినా వినకుండా నిర్దాక్షిణ్యంగా డైరెక్టరూ, కవీ కలిసి ఓ శాడ్ సాంగులో రెండుమాటలు కొట్టేసి అక్కడ అర్నవం అనేమాట పెట్టేశారు.

అప్పుడు, "నాఆత్మ శాంతించింది. నా జీవితాశయం తీరింది. పాటకూడా చూడండి. ఎంత బావుందో! అర్నవానికి అర్థం అభివృద్ధి అని ఈజీగా తెలిసిపోతోంది. ఓ కొత్తమాట ప్రజలకు చెప్పేస్తున్నాం, కొన్ని లక్షల కోట్ల మంది భారతీయులు ఈ పిచ్చరు చూసి, ఈ పాటవిని, కష్టపడి పనిచేసి, అర్నవాన్ని సాధిస్తారు" అన్నాడు రాజు ఆనంద బాష్పాలు కారుస్తూ.

"ఔను" అన్నాడు డైరెక్టరూ కవీకూడా ఆనంద బాష్పలే కారుస్తూ.

* * * *

ఈ ముగ్గుర్నీ లాంగ్‌షాట్‌లో చూసిన ఒక వర్ధమాన నటుడి బుర్ర చురుకుగా పనిచేసింది. ఓహో అనుకున్నాడు.

తక్షణం అతనిగుండె కరిగిపోయింది. అదంతా పైకితన్ని కళ్ళ

లోంచి, నీరై కారడం మొదలెట్టింది. చొరవచేసి, అతను గబగబ వాళ్ళ దగ్గరకు వచ్చాడు.

ముగ్గుర్లో దర్జాగా ఉన్న డైరెక్టరుగారికే దండంపెట్టి గద్గదస్వరంతో 'సార్!' అన్నాడు. ఆ ముగ్గురూ ఇతనివంక చూశారు.

"సార్! మీరధైర్య పడకండి. ఈ కష్టం మీకు రావాల్సింది కాదు. మీరే ఏడిస్తే, మాలాంటివాళ్ళం ఏంకాను. పోయినవాళ్ళతో మనమూ పోగలమా! పోలేము. వారు లేరు. మనకిక లేరు. ఉన్నా రారు....నాకు దుఃఖం వచ్చేస్తోంది. ఇవి సత్య కన్నీళ్ళే .... గ్లిసరిన్ మీద ఒట్టు. మీ కుటుంబానికి నా సానుభూతి; వారి ఆత్మకి శాంతి కలుగుగాక" అన్నాడు. అని వినయంగా నవ్వాడు.

డైరెక్టరుకీ, రాజుకీ, కవికీ నోట మాటలేదు. తెల్లబోయి విన్నారు.

"ఎవరోయ్ ఆ వారు. ఎవరిమాట నువు చెప్పేది" అన్నాడు డైరెక్టరు.

వర్ధమానుడి గుండె గుభేలుమంది. 'ఎవరూ పోలేదా?' అన్నాడు మెల్లిగా, జంకుతూ.

"గెటౌట్ ఇడ్డియట్" అని గావుకేక పెట్టాడు డైరెక్టరు.

* * * *

"మన వాళ్ళెవరూ పోలేదు గాబట్టి తిట్టిపోశాం అనుకో. కాని నిజంగా మనం దుఃఖంలోనే ఉంటే, ఈ పాటికి ఇందాకటి వాడు మన పిచ్చర్‌లో ఏ హీరోవో హీరోయినో ఎట్‌లీస్టు ఎక్‌స్ట్రానో అయిపోయే వాడు గదా. పొరబాటైపోయింది. కాని వాడు ఎంత తెలివైనవాడో చూశారా? ఎంత చొరవో చూశారా" అన్నాడు రాయుడు ఆ రాత్రి నిద్రబోయేవేళ.

"ఔన్నాను. భలే ఇంటలిజెంట్‌వాడు చాలా మంచివాడు" అన్నాడు రాజు.

"మరి అలాటి సూక్ష్మబుద్ధి, అలాటి చొరవా, సాహసం, మీలో సహా మేనా ఉన్నాయా? మీరు ఇంకోళ్ళ చుట్టాలకోసం పల్లీకున అంత నాచురల్‌గా యాడపగలరా" అన్నాడు రాయుడు ఆవలిస్తూ.

"ఉహూ"

"దెన్ యూ ఆర్ యూస్లెస్. మీరు ఫిలిం ఫీల్డుకే పనికిరారు. వారసత్వం కలిసి ప్రొడ్యూసరు అయారు గామట్టి సరిపోయింది కాని" — అన్నాడు రాయుడు.

రాజు, ఆవలించి 'హాయ్ రాజ్' అనుకుని పడుకుని, అందమైన కలలు చూడడానికి నాందిగా కళ్ళుమూసుకుని, పగటికలలు తయారు చేయడం మొదలు పెడుతున్నాడు. శ్రావ్యగానంలో అపశ్రుతిలా, చిక్కటి పెచ్చటి చీకటిలో హఠాత్తుగా వెల్తురు పేలింది. ఆ ధాటికి అతని మేడలు అదిరి కలలు విరిగిపోయాయి. తుళ్ళిపడి 'ఎవరూ' అన్నాడు.

"నేనండి .... అమ్మగోరు మిమ్మల్ని పిలత్తన్నారు. సాయం పడుకోడానికి. బయ్యంగా ఉందంట" అంది పనిపిల్ల సాధ్యమయినంత నవ్వకుండా.

"సాయం! నేనా? .... ఏ అమ్మగారూ." అన్నాడు రాజు.

రాయుడు కూడా మేలుకున్నాడు. "ఏ అమ్మగారైతే మీకేమండి. ఆడది .... అబల! నిస్సహాయురాలు, చీకటిలో ఒంటరిగా చలి భరించలేక సాయం పిలిస్తే వెళ్ళనంటారు .... ఇదేం న్యాయం....మీకు ఎదలేదా? దయలేదా! లేపోతే రాదా?లేదా నేవెళ్ళేదా?"అన్నాడు అతను వీరావేశంతో.

రాజు విసుక్కున్నాడు "నువ్వూకాస్త ఆగవయ్యా .... ఎవరో పరాయి ఆడది గమోసు. ఏయ్‌పిల్లా....ఇపుడు నిదరొస్తోందిటా, కావలిస్తే

పొద్దున్న వస్తారుటా, అందాకా ఆంజనేయ దండకం చదువుకో అనిచెప్పు. కావలిస్తే రాయుడు వస్తాడు. నువ్వుకూడా వుండు. ఇంకా భయమయితే." అన్నాడు.

ఆ పిల్ల మళ్ళీ చక్కావచ్చి "దవడ పళ్లు ఊడగొడతా రంటండి" అంది.

"ఎవరివీ" అన్నాడు రాజు బద్ధకంగా.

"కనుక్కొత్తా నుండండి" అంది పిల్ల.

అప్పటికి రాజు ఉలికిపడి 'ఏయ్' అని గర్జించి ఆ పిల్లని ఆపాడు.

'ఎవరే మీ అమ్మగారు?'

'అక్కడదాకా వచ్చారన్నమాట అయ్యగారు. పిల్లాడోవ్! ఈ యెదవేసాలన్నీ నాకాడెయ్యమాక అని కొత్త కంఠం వినబడింది.

'ఎవరీ ఆకాశవాణి' అని విస్తుబోయి తలెత్తి చూశాడు రాజు.

ఎదురుగా గుమ్మంమీద చీకటి ఇవతలగా వెల్తురుకు అవతలగా, రెండింటికీ సరిహద్దుగా నిల్చుంది లక్ష్మినరసు. ఐశ్వర్యానికి ఔదార్యంలా ఉన్న నల్లంచు తెల్లచీర కట్టుకుంది. చేతకానిదాని అబద్ధంలా పల్చగానూ ఎదటి మనిషి ప్రజ్ఞని అణగ ద్రొక్కేవాడి ప్రయత్నంలా నల్లగానూ ఉన్న ఆర్గండీ రవిక తొడిగింది. అమాయకత్వంలా తెల్లగాఉన్న కళ్ళకి నల్లటి కాటుక పెట్టుకుంది. కాటుక చక్రాలమధ్య రెండుదీపాలు వెలిగించింది. అవి మరీ హైపవర్ లాంపులు కాకపోయినా కాటికమధ్య ఉన్నందువల్ల రాజుకి దివ్యజ్యోతుల్లా కనిపించాయి. పాండ్స్క్రీంతో నిగనిగలాడుతున్న ఆమె ముఖానికి మరీ బంగారంతో పోటీచేసే స్తోమతు లేకపోయినా, వెనకాల ఉన్న చిక్కటి చీకటి, వెల్తురు మూలాన ఆ చీకటికో చాయ తక్కువైనా నల్లగా మెరుస్తున్న జుట్టూ కలసి యథాశక్తి

ఆ ముఖాన్ని ఆకర్షణీయంగా చేస్తున్నాయి. మొత్తానికి, ఆడదాని తెలివి తేటలమీద అట్టే నమ్మకం లేని బ్రహ్మచారి, ఓ మోస్తరుగా వేసిన అసంపూర్ణ వర్ణ చిత్రంలా ఉంది నరసు.

'నువ్వా' అన్నాడు రాజు.

'గాపకం వచ్చానా?'

'లేదు. సారీ .... ఎక్కడో చూసినట్టుంది. గాని—'

'హోరి నాయనో! అప్పుడే కల్లు నెత్తిమీన కెక్కినాయే .... లచ్చిన్నరుసునే మరిచి పోనావు .... ఆ?' అని గదమాయించింది నరసు.

రాజుకి అంతా గుర్తుకొచ్చింది. నరసుని మరిచిపోయి నందుకు ఒళ్ళు చచ్చిపోయి నట్టయింది.

'నన్ను క్షమించు నరసూ .... నన్ను క్షమించు. ఏదో ప్రొడక్షన్ హడావుడిలో మర్చిపోయాను. మనం అసలు తిరపతి వెళ్ళి పెళ్ళిచేసుకో వలసింది కదూ .... మీ బాబాయి కూడా — అన్నట్టు మీ బాబాయేరీ?'

'వత్తాడు .... సూటింగు కెల్లేడులేగాని....దా. ఆల్లో కూకుందారి. నువ్వేవేం సేసినావో అంతా సెప్పాలి దా' అంటూ ముందుకువచ్చి రాజుని లేవదీసి తీసుకుపోయింది నరసు.

రాముడు తెల్లబోయాడు. 'హోరి బాబోయ్! మన వాడికి హీరో యిను కూడా ఉందే' అనుకుని.

'నాకు భయం వేస్తోంది. నీకు సాయం ఉండనా' అన్నాడు అందంబటే ఉన్న పనిపిల్లనుచూసి.

'పల్లు రాలగొడతాను .... ఈసారి ఒపురియో కనుక్కురానక్కర లేదు బుల్లోడా' అని గిరుక్కున తిరిగి చక్కాబోయింది ఆ పిల్ల.

*   *   *   *

హాల్లో, సోఫామీద నరసు తల్లో పూలపరిమళం మధ్య, పల్చటి చీకటి మధ్య కూర్చుని గత రెండు రోజులూ తానెక్కడెక్కడి కెళ్ళేడో, ఏవేం చేశాడో చెప్పాడు రాజు. చెబుతున్న కొద్దీ, తన కథ అతనికే వింతగా కనబడుతోంది. అక్కడక్కడ అది తన కథ కానేకాదన్న అనుమానం వేసింది. అనుమానం కలిగినప్పుడల్లా, ఈ సిరి, నరసు తనకు దక్కకుండా అంతర్ధానం కావచ్చునన్న అధైర్యం పట్టుకుంది.

'నేనెవరు? .... (రాజుని) నాకీ డబ్బెక్కడిది .... (లక్షన్నర ఆస్తి ఉందిటగా) .... ఎవరు చెప్పారు? (లక్షిన్నరసు బాబాయి). వాడెవడు? ....,

'వాడెవడు. అసలు మీ బాబాయెవ్వరు? నరసూ' అని అడిగాడు రాజు. ఆ ప్రశ్న చీకట్లో చాలా సేపు తారట్లాడింది.

'ఎవరైతేనేలేం' అంది నరసు అతని జుట్టును సముదాయిస్తూ.

రాజుకి ఆ ప్రశ్నకి జవాబు తెలుసుకోవాలన్న పట్టుదల సడలి పోతోంది. నరసు మెత్తని చేతులు సముదాయిస్తూ ఉంటే, ఆమె మెత్తని మాట ఉపశ్రుతిగా వినిపిస్తూంటే మెల్లిగా కళ్ళుమూసుకుని తనకి యిష్టమైన కలలు అల్లుకోవడానికి మళ్ళీ మొదలు పెడుతున్నాడు.

"బాబాయి అంటే మా బాబేలే...." అంటోంది నరసు....

బా....బాయికి ఇదివరకు చాలా డబ్బుండేది. నాటకాల వాళ్ళతో తిరిగేవాడు. నరసు తల్లి, ముత్యాలును చూసి ఒకప్పుడు సరదాపడ్డాడు. నాటకాల్లో వేషాలేయించి సినిమాల్లోకి ఎక్కించేస్తా ననేవాడు. ఈవైనం ముత్యాలు తమ్ముడికి తెలిసింది. ముత్యాల్ని పెళ్ళాడకపోతే, ఇతని డొక్క చీల్చి డోలుకట్టించి, ఇనాంటి 'యదవ నాయాళ్ళ' కథలను ఆ డోలుమీదే దండోరా వేయించాలని ప్రోగ్రాం వేసుకున్నాడు ముత్యాలు అన్నదమ్ముడు.

"దాన్నిగనక పెళ్ళాడితే ఆస్తియివ్వనని ఇతగాడి తండ్రీ, నూతిలో దూకుతానని తల్లీ ప్రకటించారు. తల్లిదండ్రుల కార్యక్రమాలకన్న, బావ మరిదిదే కొంచెం ఎక్కువ యిబ్బందిగా ఉన్నందువల్ల నరసుతండ్రీ, అప్పట్లో ముత్యాలును వెంటబెట్టుకు చెన్నపట్నం వచ్చేశాడు. ఐదేళ్ళు నానా అవస్థా పడ్డారిద్దరూ. ఆనక తండ్రి హరీమన్నాడు, తల్లి ఇంకో నెల్లాళ్ళకి కళ్ళుమూసింది. అప్పుడు, ఇతగాడు స్వగ్రామం వెళ్ళి ఇల్లూ వాకిలీ ఆస్తి చిక్కబట్టుకుని, పూటుగా డబ్బు చేతబట్టుకు చక్కావచ్చాడు. దరిద్రంలో ఉండగా, ముత్యాలు చాలామంది మాటలు నిజమని....నమ్మె స్తోందని అనుమానం కలిగినందువల్ల ఆమెమీద అతనిప్రేమ దినదిన ప్రవర్ధమానంగా పెరగలేదు. చేతికి డబ్బు వచ్చేసరికి అతగాడికీ, ముత్యాలు మీద మనసు పూర్తిగా విరిగిపోయింది. బుద్ధిలేదు విశ్వాసంలేదు అని తనకి తనే నచ్చచెప్పుకుని, చెన్నపట్నంలో రైలు దిగేసరికి మనసు ఖరారు చేసుకుని, అతను యింటికి వెళ్ళకుండా ఇంకోపేటలో సుభ్రమైన యిల్లు తీసుకుని సినిమాతీసే వ్యాపారంలో దిగాడు. ఐదేళ్ళ దరిద్రంవల్ల, కష్టాలు అవమానాలూ పడినమీదట రాటుదేలాడేమో, డబ్బువచ్చిన మీదట తెలివిగా మనుషుల్ని ఉపయోగించుకోవడం, అవసరం లేనివాళ్ళని వదుల్చుకోడం నేర్చుకున్నాడు. అతడు కొత్తింట్లో దిగిన నెల్లాళ్ళకి, ముత్యాలు అతని ఎడ్రసు సంపాదించి, వెళ్ళి మొత్తుకుంది. అప్పటికి నరసు నాలుగేళ్ళపిల్ల.

ఆమె దుఃఖాన్ని వ్యాఖ్యానించడానికి 60 వయోలిన్‌లూ, 600 క్లారియోనెట్‌లూ కూడా చాలవు. లక్షమంది ఎమ్మెస్ రామారావులు ఆనరు.

'పిల్ల మొకం సూడు' అని కాళ్ళావేళ్ళాపడి ఏడ్చింది.

'చూశాకనే ఈనిర్ణయానికి వచ్చాను. అది నాకూతురు కాదు........ నీకూ నాకూ ఋణం తీరిపోయింది....' అని దులిపేశాడు.

ముత్యాలుకు రోతపుట్టింది.

ఆ స్థితిలో మళ్ళీ తన తమ్ముణ్ణి పిలిపించి మొగుడికి ఒళ్లు హూనం

చేయించాలని ఊహాపోయినా ఛీ ఎందుకులే అనుకునేటంత అసహ్యం వేసింది.

తరవాత ముత్యాలు, మనసు రాయిచేసుకుని పిల్లని పెంచడమే తనకి ముఖ్యం అని నచ్చచెప్పుకుని, అందుకోసం తనకు చేతనైన పద్ధతిలో జీవితాన్ని వినియోగించుకుంది.

ఆమెని కాదని కాదని కాలదన్నిన, అబ్బికి కూడా రోజులు అంత బాగా కలిసిరాలేదు. అతడు వాటాకలిపిన సినిమా దివాళాతీసింది. అయితే తలకాయలు యధాశక్తి మార్చి ఎలాగో అలా ఓమేడా కారూ నిలుపుకునే తెలివితేటలు మాత్రం గడించాడు.

ముత్యాలు ముసలిదై, నరసు పెద్దదైంది.

ఓరోజున, సినిమాలో వేషానికి నరసు కావాలని ఒక షాఫరుద్దీన్ వచ్చి ఆమెను కంపెనీకి తీసుకెళ్లాడు.

నరసు తొలిసారిగా తండ్రితో మాట్లాడింది అక్కడే. అంతకు ముందు చాలాసార్లు ముత్యాలు అతన్ని దూరంనించి చూపించి అదిగో ఆయనే నీబాబు అని చెప్పింది. కాని దగ్గిరకెళ్ళి పలకరించనివ్వలేదు. ఈసారి అనుకోకుండా ఈ దౌర్భాగ్యపు సన్నివేశం తటస్థపడగానే.... నరసు నిలువెత్తున లేచిపోయి, అతన్ని తిట్టిపోసి, అనక తనెవరో చెప్పేసింది. తండ్రి దాదాపుగా కూతురు కాళ్ళమీద పడ్డంత పనిచేశాడు. 'నేను మహాపాపిని నాకు ప్రాయశ్చిత్తం లేదు' అనికూడా అన్నాడు.

నరసు, 'మా యమ్మని మళ్లీతెచ్చి యింటో బెట్టుకో' అని ప్రాయశ్చిత్తం సూచించినా అతనికి నచ్చలేదు....

ముత్యాలుకీ నచ్చలేదు. కాళ్ళిరగ్గొడతాను.... ఆడు ఈడకొచ్చినా, నువ్వాడకెల్లినట్టు తెలిసినా" అంది కోపంగా.

'ఆడు ఈడకి' రాకపోయినా నరసుమటుకు అడపా తడపా వెళ్ళి పలకరించి వచ్చేది. కొన్నాళ్ళు, ఎవరేనా వున్నపుడు నరసుని పలకరించ డానికి భయపడేవాడు తండ్రి. 'బాబాయ్ అని పిలవకు' అని సలహాకూడా యిచ్చాడు. కాని మెల్లిగా ధైర్యం తెచ్చుకొని ఆప్యాయంగా చూసుకునే వాడు కూతుర్ని. ఒకటి రెండు పత్రికలు వాళ్ళ ఈ'కథ' ను సీరియల్‌గా రాయబోయాయి.

'డొక్క చీల్చేస్తాను' అని, తన బావమరిది కట్టిన డైలాగుని ఆ పేపరువాళ్ళ ముందర వల్లించి వెళ్ళాడతడు. ఇదిచూచి నరసూ భయపడింది. 'ఫరవాలేదమ్మా' అన్నాడు తండ్రి. ఫరవా వస్తే అడపా దడపా డబ్బిచ్చే వాడు. ముత్యాలు ఒప్పుకోలేదు.

'యదవేసా లెయిమోక. డబ్బిత్తే చేదాయేం. వద్దంటానికి మనమేం సినిమాలో యేసాలం అనుకున్నావా' అని నరసు తల్లిని కోప్పడింది.

ఈ నరసు ఆర్జన ఆరంభించాక హాయాం ఆమెకే ఇచ్చేసింది ముత్యాలు; గొణిగే హక్కు మినహా. వారంరోజులనాడు, నరసు, వరహాల రాజుకి ఆశ్రయం ఇచ్చిందని వినగానే, బాబాయి మండిపడ్డాడు. ఆనక వాణ్ణొదిలెయ్ అన్నాడు. నరసు వినలేదు. తన కథలాగే కూతురు బతుకూ భయంకరంగా అవుతుందని భయపడి 'ఎల్లుండి తిరపతెళ్ళి పెళ్ళాడెయండి' అన్నాడు. తన విషయంలో ముత్యాలు చేసిన పొరబాటు కూతురు విషయంలో జరక్కుండా ఉండాలని....

మగతలో ఉన్న రాజుకి ఈ కథ లీలగా వినిపించి, లీలగానే అర్థం అయింది. తనకి డబ్బెలావచ్చిందీ అన్న అతని మొదటిప్రశ్న ఇంకా చీకట్లోనే తారట్లాడుతోంది. అది తేలక అతను మథనపడుతున్నాడు. ఇపుడు నరసు కథ విన్నాక భయంకూడా వేసింది. జీవితం ఇంత గంద్ర గోళంగా ఉంటుందని అతనికి నమ్మకం కలగకపోయినా అనుమానం

వేస్తోంది. తన సిలుకు చొక్కా, పరుసూ, నరసూ, కారూ, సినిమా, డ్రైరెక్షను అన్నీ పోతాయేమోనని భయంవేసింది.

నరసు దగ్గరగా ఉండడం ఆమె చెయ్యి తన చెంపమీద నిమురుతూ ఉండడం మాత్రమే అతనికి నచ్చాయి. చుట్టూరా వెచ్చని చీకటి కొంచెం ధైర్యం కలిగిస్తోంది. ఇంకా తెల్లారాలిగదా. ఈలోగా ఏంజరగదు. అందాకా ఫరవాలేదు అనుకుని, మళ్ళీ పగటికలల ఉత్పత్తికి ఉపక్రమిస్తున్నాడు.

* * * *

హఠాత్తుగా ఆ చిక్కటి వెచ్చటి చీకట్లో—

చెరువులో రాయిలా, నిశ్శబ్దంలో గావుకేకలా, దాంపత్యంలో ద్రోహంలా, అబద్ధంలో నిజంలా, దరిద్రంలో డర్బీస్వీప్‌లా, ఆశలో నిరాశలా, మబ్బులో మెరుపులా, వీణాగానంలో తీగెతెగడంలా, మామూలు పత్రికలో యుద్ధప్రకటన వార్తలా, మృత్యువులో జీవితంలా, స్నేహంలో వంచనలా, ప్రభుత్వంలో కుట్రలా, ఈ ఉపమానాల గంద్రగోళంగా వెకిలిగా వింతగా భయంకరంగా సహజంగా అద్భుతంగా హఠాత్తుగా ఆ గదిలోపలి చీకటిలోపలి అతని ప్రశ్నకి జవాబులా నూరు కొవ్వొత్తుల వెల్తురు బద్దలయేసరికి రాజుకి ఒళ్ళు ఝల్లుమంది. గుండె గుభేలుమంది. నరసు తుళ్ళిపడిలేచి, చీరెసర్దుకుని నిలబడి 'ఎవరదీ' అంది.

ఖయస్, లైలాలు కూర్చుని కమ్మగా కబుర్లు చెప్పుకుంటూ ఉండగా ముక్కామల కృష్ణమూర్తి 'యింతలేసి' కళ్ళు చేసుకుని, కొరడా ఛెళ్ళుమనిపిస్తూ వచ్చిపడినప్పుడు ప్రేమికుల గుండెలు ఏమయ్యాయో, వాళ్ళు ఎంత ఆశ్చర్యపడ్డారో, ఆ ఘట్టంలో వాళ్ళ భావాలమీద సుబ్బరామన్‌గారు ఎన్ని వాయిద్యాలతో ఎలాటి స్వరాలతో సానుభూతి పలికించారో వరహాల రాజుకీ, లక్ష్మన్నరసుకీ గుర్తుండి ఉండదు. కాని, ఆ క్షణంలో—ఘనీభవించిపోయిన ఆ క్షణంతోపాటు వారూ కొయ్యబారిపోయారు. లైలా మజ్నూ చూడకపోయినా పైనచెప్పిన ఘట్టాన్ని అనుభవించి ఉంటారు.

ఈ వాక్యాలన్నీ, మన సినిమాలలో జరగబోయే ప్రమాదానికి సూచనగా ముందే వినిపించే సంగీతంలా ఉన్నా, ముక్కామల కృష్ణమూర్తి వరహాలరాజుని కొట్టే ప్రమాదం మటుకు లేదు.

ఆ గదిలోకి వచ్చిన మనిషి నరసు బాబాయి. అతని చేతిలో కొరడా లేదు. దీపం వెలగగానే లేచి నించుని 'ఎవరూ' అన్న నరసు వెంటనే కొయ్యబారి పోలేదు. 'నువ్వా బాబాయ్' అంది. అంతవరకూ మగతలో వున్న రాజు కూడా, మెల్లిగా కళ్ళుతెరచి, రెపరెపలాడించి 'మీరా' అన్నాడు.

"షటప్. రాస్కెల్. గెటౌట్, చీట్" అన్నాడు బాబాయి తక్కువ మాటలలో ఎక్కువ భావాలు పొదిగి.

రాజు నవ్వాడు. తన వెనక ఎవరో ఉన్నట్టున్నారన్న దురభిప్రాయంతో, వెనకనున్న మనిషిని వెనకేసుకొస్తూ 'కోప్పడకండి సార్. పూర్ ఫెలో' అన్నాడు పెద్ద మనిషిగా.

'షటప్! గెటౌట్' అన్నడు బాబాయి మళ్ళీ. తెలుగు సినిమాకారులు, తీసిన కథనే తీసినట్టు, వేసిన అయిడియానే వేసినట్టు, ఆయనా కొత్త మాటలు తట్టక పాతవే వాడాడు. పాతకథల సినిమాల లాగే అవీ కొంత పనిచేశాయి.

'ఎవరూ నన్నా?' అన్నాడు సూక్ష్మబుద్ధి రాజు చటుక్కున వెనక్కి తిరిగి చూసుకుని.

చంద్రలేఖలో సెట్టింగులలా భారీ ఎత్తున వున్న ఒక పెద్దమనిషి, సన్నగా పొట్టిగా, చూట్టానికి చుంచులా కనిపించు ఇంకో బుల్లిమనిషీ బాబాయి వెనకాల బాక్ గ్రౌండ్ మ్యూజిక్‌లా నిల్చునివున్నారు. కోపంలో మునిగి తేల్తున్న బాబాయికి భాష అందటంలేదని వాళ్ళకు తట్టగానే ఇద్దరూ పుంజుకున్నారు.

"ఆ ఆ మా ఉణ్ణైత్తాన్ .... ఏన్‌కుడాదు? ఉణ్ణయ్ నంబి తణ్ పెణ్ణయ్ కుడుక్కసిత్తమాణ నంబ అణ్ణావుక్కు వంజనై సెయ్యలామంత్ర యోజనై ఎణ్ణత్తిల్ ఇణ్ణేరముం పైత్తిక్కొండిరింద కుట్రవాలియే! ఉణ్ణైయ్‌త్తాన్....ఏన్ కుడాదు?" అన్నాడు పెద్దవాడు గుక్కపట్టి.

"ఆమ్ ఏన్ కుడాదు?" అని వంతపాడాడు చిన్నవాడు క్రింది షడ్జమం నించి పై షడ్జమానికి షికారెళ్ళొచ్చి.

నరసు ఝుమసుకుంది. రాజు ఆమె వీపు తట్టాడు.

"అల్ల" అని మళ్ళీ పుంజుకున్నాడు పెద్దవాడు. "అల్లే....ఇరండు లక్షం రూబానోటు, ఉరుండురిండియాహ వీట్టిల్ ఇరిందిరిక్కరదంద్రు, మూంద్రు నాళాహ మోసం పణ్ణి పెణ్ణోడ అణ్ణావిణ్ పణత్తైయుం వాంగ ప్పార్‌త—యన్ సిన్ని కణ్ణే .... ఉణ్ణయ్‌త్తాన్! ఏన్‌కుడాదు?" అన్నాడు.

"ఆమ్ .... ఏన్ కుడాదు" అన్నాడు చిన్నవాడు.

నరసు రెండు చెవులూ మూసుకుని 'బాబోయ్ వాళ్ళని ఆగమను బాబాయ్' అంది. అప్పటికి బాబాయి కోపంలోంచి తేరుకుని, మానవుడి స్థాయిని అందేసుకున్నాడు. అయితే తనకూడా వచ్చిన మిత్రులు పుంజుకుంటే, వాళ్ళని ఆపడం ఓపట్టాన తెమలదని తెలుసు. వాళ్ళు శివాజీ గణేశన్ భక్తులు. గణేశన్, ఎం. జి. ఆర్. నిత్యజీవితంలో కూడా అలా గుక్కతిప్పుకోకుండా రీలు పొడుగు డైలాగులు మాట్లాడుతారని వాళ్ళకి గట్టి నమ్మకం. అందుకని అవి సాధకం చేసుకు మరీ వచ్చారు పెన్నపట్నం. నరసు బాబాయి తీయబోయే డబుల్ వర్షన్ పిక్చరులో తమిళ చిత్రంలో వాళ్ళు వేషాలువేసే ప్రమాదం ఏర్పడింది. రెండుజిల్లాల డిస్ట్రిబ్యూటర్లు వీళ్ళుంటే తబ్బిస్తామన్నారు.

"లాభంలేదు తల్లీ. వాళ్ళు ఆగరు...."

"అల్లై...." అంటున్నాడు పెద్దవాడు మళ్ళీ.

వాళ్ళ గోల అణచడానికి బాబాయికూడా అరిచాడు "వీళ్ళ ఆగ రమ్మాయ్" అని.

లక్ష్మీనరసుకి ఒళ్ళు మండిపోయింది. చెంగు బిగించింది. దగ్గరున్న పళ్ళెం తీసి విసిరింది. దెబ్బతగిలిన అరనిమిషానికి డైలాగు పూర్తిచేసి ఆగి, "అప్పా....కణ్మణీ....ఎణ్ణయే ఏన్ అడిత్తాయే!" అన్నాడు.

"నోరుముయ్. మళ్ళీ మాటాడితే ముక్కు లిరగదంతా యదవగోల యదవ గోలాని" అంది నరసు.

"అయితే ఏమిటంటారువాళ్లు మావగారూ?" అన్నాడు రాజు సిగరెట్లు తీస్తూ.

"షప్ గెటౌట్" అన్నాడు బాబాయి.

ఆయనకింకా కోపం లేదనడానికి భాషణలో పునరుక్తి దోషం నిదర్శనం :

"నీగురించే. నువ్వేదో టోకరా యిచ్చినావంటన్నారు. రెండులక్షల డబ్బు యింటికాడుందని అబద్ధాలు సెప్పి, మా బాబాయిని మోసం సేసినా వంట. నన్నూ, మా బాబాయికాడ డబ్బునీ తీసుకు లగెత్తాలని సూత్తన్నా వంట .... అంతేనా బాబాయ్!'' అంది నరసు.

"ఔను. దొంగవెధవ .... మోసకారి. దగాకోరు. నాకే టోకరా యిస్తాడూ. ఎవడనుకుంటున్నాడో సుబ్బన్నంటే" అన్నాడు బాబాయి.

* * * *

"థాంక్యూ సార్" అన్నాడు పాసార్థి.

సుబ్బన్న వెనక్కిచూసి ''నువ్వెవడవోయి'' అన్నాడు విసుగ్గా.

"మీరు ముందర ఆశ్చర్యపోవాలండి. అర్ధరాత్రి పూట ఎలా ఎందుకు వచ్చావు అని. తరువాత నా చిరునామా అడగాలి .... పోన్లెండి నాపేరు పాసార్ధి. ఈ కథ రాస్తున్నాను. మీపేరు తెలీక బాబాయి అనీ, నరసు నాన్న అనీ రాయలేక అవస్థపడుతున్నాను. పేరు చెప్పారు అందుకు థాంక్సు" అన్నాడు పార్థసారథి.

"సంతోషించాం గాని గెటవుట్."

"సార్. మీకు యింత ఉపకారం చేస్తున్నా కృతజ్ఞత చూపకుండా పొమ్మంటున్నారు గదూ!" అని వెళ్ళిపోయాడు పార్థసారథి.

కృతజ్ఞత అన్నమాట వినగానే సుబ్బన్న వీరభద్రుడై పోయాడు. (అందుకే పాసార్ధి ఫేడౌట్ అయిపోయాడు.)

సుబ్బన్న ఒక్కసారిగా వరహాలరాజు మీదికి విరుచుకుపడ్డాడు.

"ఇంకా యేం నించున్నావురా? లక్షన్నర ఆస్తి ఉందని, ఫిలిం తీస్తాననీ బుకాయించి తిష్టవేస్తావా? డబ్బు తింటావా? విశ్వాసం లేకుండా. నీగుట్టు తెలిసిపోయిందిలే. బికారివెధవా. దగాకోర్. ఫో" అన్నాడు.

"ఏదో ఒకటి తేల్చుకోండి. అతను దగాకోరు అయితే బికారి వెధవగా ఎలా ఉండగలడు?" అన్నాడు పాసార్ధి నేపథ్యంలోంచి.

నరసుకి కూడా తండ్రి తరహా నచ్చలేదు. ఆమె మనసుకి కష్టం వేసింది.

"అలా తిట్టకు బాబాయి. ఆడు నా మొగోడు...." అంది.

"నీకూ వాడికీ ఋణంతీరిపోయింది. వాడితో మాటాడితే చంపేస్తా .... బయటికి పోరా" అంటూ రాజు మెడమీద చెయ్యివేసి గెంటేశాడు సుబ్బన్న.

ఈ గొడవకి అప్పుడే నిద్రలేచివచ్చి అంతా చూస్తున్న రాయుడికి ఢీ కొట్టాడు తూలిపడ్డ రాజు.

ఆప్తమిత్రుడిని చూడగానే దుఃఖం పొంగి వచ్చింది రాజుకి. "చూశావా రాయుడూ. మావగారు ఎంత అన్యాయం చేస్తున్నారో" అన్నాడు.

రాయుడు తమాషాగా నవ్వి, ''సార్, మీరు పొరబడుతున్నారు. నన్ను ఫ్రెండో ఎవరో అనుకుని సారీ. .... నాపేరు ఆంజనేయులు" అన్నాడు మర్యాదగానే.

రాజు తుళ్ళిపడి మిత్రుడి మొహంలోకి తేరిపార చూశాడు.

"నా మిత్రుడే! రాయుడే ఈమాటలన్నది!" అన్నాడు.

"కాదయ్యా, ఆంజనేయుల్నంటూ ఉంటే!" అన్నాడు రాయుడు.

నరసు రాజు దగ్గరికి వెళ్ళబోయింది.

రాజు 'నరసూ', అన్నాడు. నరసు 'రాజూ' అంది.

సుబ్బన్న హూంకరించి, ఒక గెంతువేసి రాయుడినీ రాజునీకూడా కలిపి తలుపవతలికి తోసేసి, తలుపేసి హూంకరించాడు మళ్ళీ.

బయట హోరున వాన కురుస్తోంది.

రాజూ, రాయుడూ వరండాలో ఓ మూల కూర్చున్నారు.

'నిజంగానే నీకు డబ్బులేదా రాజూ?' అన్నాడు రాయుడు.

'ఉంది' అంది ఆకాశవాణి పాసార్థిగొంతు వేషం వేసుకుని.

''ఉందిట. లేకేం'' అన్నాడు రాజు.

"చూశారా రాజుగారూ .... ఇదే ప్రపంచం. విశ్వాసం ఉండదు" అన్నాడు రాయుడు సగౌరవంగా.

రాజు మాటాడలేదు.

"యస్సార్. కృతజ్ఞత అనేది ఎక్కడాలేదు. చూడండి. మీ ప్రేయసి నరసు .... మీ మావగారు .... వీళ్ళంతా తమరు పరమ దరిద్రు లని తెలియగానే ఎలా వదిలేశారో .... కృతజ్ఞత అంటే ఓ కథ జ్ఞాపకం వచ్చింది .... పాపం జమన్‌లాల్ టోక్రానీ, దిలరుబాలా ఇంకా నాకళ్ళ ముందు మెదుల్తూనే ఉన్నారు .... నేనప్పుడు బొంబాయిలో ఉండేవాణ్ణి. టోక్రానీ సింధీవాడు లెండి.....